



## స్త్రీ వశ్యమంత్రం

ఒకానొక చలచిత్తపుశాస్త్రులుగారు స్త్రీ వశ్యము నేర్చుకొనదలచి, కనబడిన సన్యాసులనెల్ల కాళ్ళు వ్రేళ్ళు పట్టుకొని ప్రార్థించుచు పది రూపాయలు బహుమాన మిచ్చెదనని ఆశపెట్టుచుండెను. ఒకనాడొక సిద్ధుడాతని ప్రార్థన విని, అరే బాబూ! మాకు వరహాలతో పని యేమి! పరమాత్ముని కృపఘంటే చాలును, జై భజరంగభళి, అని కళ్లు మూసుకొని ఏదో ధ్యానించువానివలె నీకొక చిన్న చిట్కా నేర్పుమని గురువుగారి యాజ్ఞఅయినది. జై భుజంగనాథ్ అని ముమ్మారు తలచుకొని, ఓయ్! శాస్త్రీ! ఆ మంత్రశక్తివలన సమకూడేవి మూడు మాత్రమే. స్త్రీవశ్యము, జనవశ్యము, రాజవశ్యము, సిద్ధించునని పలికి, జై సద్గురోన్నమః అంటూ ఏదో చెవిలో మంత్రముపదేశించి చిన్న వేరొకటి వానిచేతిలోనుంచి, జై, జై, శంకర జై మహదేవ్, అని పలాయనమయ్యెను. ఇలా కొన్నాళ్ళు దొర్లించి ఆ చవట శాస్త్రి జై భజరంగభళీ! అని గురువుగారితీరున జపంచేసి స్నానముచేసి, సిఖ జారుముడియు, ముఖమున విబూది రేఖ వగైరా హంగుల్తో సాక్షాత్తు పరబ్రహ్మస్వరూపుని వలె, వీధిలో పోవుచుండగా, నొక సుందరాంగి తటస్థపడెను. అంతట నాతడు తటాలున మనస్సులో జై భజరంగభళి, అని వక్కాణించుకొని, మొలనున్న వేరు తీసి నోటిలో వేసుకుని, అనుమానము, భయము లేక, తుపుక్కున ఆ మీనాక్షి మోముపై నుమిసెను. ఆ అన్నుల మిన్నయు ఆశ్చర్యమొంది, చట్టున అతనిచేయిపట్టుకొని, నిలువబెట్టి కేకలు వేయగా, గురుబానతిని, స్త్రీవశ్యము లభించెను. ఇంతలో పదిమంది గుమిగూడి అతనిని బట్టుకొని పిలకసాగతీసి బుర్ర రామకీర్తనలు పలుకునట్లు చేయగా జనవశ్యమైనందుకు మనస్సులో భజరంగభళిని తలచుకొనెను. పిమ్మట న్యాయస్థానమందతనికి రాజదండనము చల్లగా విధింపబడినప్పుడు ఆశాస్త్రి జై గురుదేవ్, నీమాటలు అబద్ధములు కావు, స్త్రీవశ్యము, జనవశ్యము, రాజవశ్యము గూడ నెరవేరినది, యని సంతోషించుతూ, తన గురుదేవు డుపదేశించిన భజరంగభళిని తలుచుకొని చేతినున్న రుద్రాక్షమాలలు త్రిప్పుచుండెను. ఆరాజుగారు వీని తీరుగని ఇతడేదో, ఎవరివద్దనో, ఒక చిట్కా నేర్చి తత్ఫలిత మనుభవించెను. ఇతనిని చూడ చాలా అమాయకునివలెనున్నాడు. పో, పొమ్మనిన, శాస్త్రి ఆతని గురుదేవుని తలచుకొని, జై! భజరంగభళి అని అక్కడున్న అందరికి నమస్కరించి చల్లగా దారితీసెను.

డి. ఎస్. మూర్తి.

* * *

## బొటనవ్రేలు

బొటనవ్రేళ్లకు పూర్వీకులు తగని ప్రాముఖ్యం ఇచ్చినట్లు కనిపిస్తుంది చరిత్ర చేతపట్టినప్పుడల్లా. పూర్వకాలంలో—ఇప్పుడు కూడా లేండి — ఇదు వేళ్లలో 'ఏది గొప్పదిరా' అంటే ఎవడన్నా అంతా బొటనవ్రేలికి ఓటిచ్చేవారు. పూర్వంరాజు లెవరన్నా సంధి చేసుకుంటే ఇద్దరూ తమబొటనవ్రేళ్లను చెరొకముల్లుతో పొడుచుకొని ఒకరినెత్తురొకరు త్రాగేవారు. అలా త్రాగితే స్నేహం యెప్పటికి విడిపోదన్నమాట! కొందరు మహనీయులు బొటనవ్రేలిని రెండో చెయ్యి అన్నారు (అంటే మనిషికి నాలుగు చేతులన్నమాట) పూర్వం ఎక్కడ ఎంత దెబ్బ తగిలినా యుద్ధానికి తఱిమేవారు. కాని బొటనవ్రేలు ఏమాత్రం దెబ్బతగిలినవాణ్ణి యుద్ధానికి వెళ్లనిచ్చేవారు కాదు. అందుకనే కొందఱు రాజులు యుద్ధంలో దొరికిన ఖైదీలకందరికి బొటనవ్రేళ్ళు నరికేశేవారు. అట్లా చేస్తే వాళ్ళింకెప్పటికి కత్తి తాకటానికి వీలుండదని వాళ్ల నమ్మకము. ఇంత కొందరు మహనీయులు యుద్ధానికి పోవలసివస్తుందని బొటనవ్రేళ్ళు నరుక్కునేవాళ్లట! గ్రంథకర్త లెవరన్నా నేరంచేస్తే వాళ్ల బొటనవ్రేళ్లు కొఱికించేవాళ్లట రాజులుకొందరు. ఒక యుద్ధవీరుడు తన కొడుకుల శౌర్యం చూడలేక చిన్నప్పుడే వాళ్ల బొటనవ్రేళ్ళు నరికేయించాడట. అందుకని అతని ఆస్తి అంతా ప్రభుత్వం స్వాధీనం చేసుకొని, అతనికి యావజ్జీవం శిక్ష విధించిందట. అంతెందుకు? ఇప్పుడు నేనింతసేపు కలంపట్టుకొని రాయగలిగిందా బొటనవ్రేలి సహాయంవల్లనే కదూ ?

(ఆంగ్లంనుంచి)

రేవూరు కృష్ణమూర్తి.